పూల జాతర



బతుకమ్మతో యువతి



అడ్డగూడూరు: బతుకమ్మలను తీసుకువెళ్తున్న మహిళలు



భువనగిరి: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ...



యాదాద్రి ఆలయంలో..

పల్లె, పట్టణం ఏకమైంది.. ఊరువాడా కదలివచ్చింది..అందరి అడుగులు చెరువుల వైపు కదిలాయి.. బతుకమ్మ పాటలు మారుమోగాయి.. గురువారం జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా ముగిశాయి.. తొమ్మిది రోజుల పాటు రోజుకో రకమైన నైవేద్యాన్ని గౌరమ్మకు సమర్పించారు.. చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు జరిపారు.. తంగేడు, బంతి, చేమంతి.. ఇలా రకరకాల పూలతో పెద్దపెద్ద బతుకమ్మలను పేర్చి ఒక దగ్గర చేర్చి ఆనందంగా ఆడారు. పాడారు..మరో ఏడాది వరకు అనుభూతులను మదిలో దాచుకున్నారు.

- న్యూస్‌టుడే బృందం



అడ్డగూడూరులో...



మోత్కూరు ఉన్నత పాఠశాలలో...



భువనగిరి: మీనానగర్‌లో...



ఆత్మకూరు(ఎం) పీర్ల చెరువు వద్ద మహిళల కోలాహలం

ఆహార భద్రత.. 2028



మిర్యాలగూడ పట్టణం, భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: కరోనాతో కుదేలైన పేదలను ఆదుకునేందుకు కేంద్రం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తూ వస్తోంది. 2021 నుంచి మూడు నెలలకో సారి పథకాన్ని పొడిగిస్తూ వస్తున్న కేంద్రం.. 2023 డిసెంబరులో ఒకేసారి ఏడాది పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఉచిత బియ్యం పంపిణీ గడువు ఈ ఏడాది డిసెంబరుతో ముగియనుండడంతో మరోసారి భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ..

ఆహార భద్రత కార్డుదారులకు గత కొంత కాలంగా కేంద్రం ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తుంది. ప్రస్తుతం పంపిణీ చేసేందుకు నిర్ణయించిన బియ్యం సైతం పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో పేదలకు బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ మరో నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 పోషకాలు ఉంటాయి.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి:

వెంకటేశ్వర్లు, డీఎస్‌వో, నల్గొండ

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 2028 డిసెంబరు వరకు రేషన్ కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నాం. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయనున్నందున లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

ఉమ్మడి జిల్లాలో 10,07,039 కార్డుదారులకు లబ్ధి..

కేంద్రం నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 10,07,039 కార్డుల్లోని 29,83,445 మంది యూనిట్లకు నాలుగేళ్ల పాటు లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 63,795 అంత్యోదయ కార్డులు ఉండగా.. ఒక్కో కార్డుకు 35 కిలోల చొప్పున, 9,43,145 ఆహార భద్రత కార్డులు ఉండగా.. ఇందులోని యూనిట్‌కు 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారు. అక్టోబరులో అంత్యోదయ కార్డులకు 22,32,825 కిలోలు, ఆహార భద్రత కార్డులకు 1,68,41,556 కిలోల బియ్యం పంపిణీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రేషన్ కార్డులు, అక్టోబరులో కేటాయించిన బియ్యం వివరాలు..

జిల్లా	మొత్తం కార్డులు	యూనిట్లు	బియ్యం (మె.టన్నుల్లో)
నల్గొండ	4,66,015	13,92,156	8,914.099
సూర్యాపేట	3,24,184	9,31,351	5,945.164
యాదాద్రి	2,16,840	6,59,938	4,216.108

అత్యవసరమైతే ఔషధాలు కొనుగోలు చేయండి: కలెక్టర్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: రోగులకు అత్యవసరమైన ఔషధాలు నిల్వ లేకపోతే కొనుగోలు చేసి ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కె జెండగే ఆదేశాలు జారీ చేశారు. చౌటుప్పల్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. వైద్యాధికారులతో సమావేశమై వారి పనితీరును సమీక్షించి వివరాలతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వేళలో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, రోగులకు అవసరమైన ఔషధాలు నిల్వ ఉన్నాయని వెల్లడించారు. గర్భిణులకు సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలని సూచనలిచ్చినట్లు తెలిపారు. గత 28 నెలలుగా కదలకుండా ఉన్న అంబులెన్సును చూశారు. డ్రైవరును నియమించలేదని, నిర్వహణకు బడ్జెట్ కేటాయించలేదని స్థానిక వైద్యులు సమాధానమివ్వడంతో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయాధికారి డా. చిన్నానాయక్‌ను ఆదేశించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రాజగోపాల్, వైద్యాధికారులు అలివేలు, దేవేందర్, శ్వేత ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ హనుమంత్ జెండగే

ఫిర్యాదులు: ☛ రక్త పరీక్షలు చేయించుకున్నా రిపోర్టులు ఇవ్వకపోవడంతో తమకు డయాలసిస్ చేయించుకోవడానికి ఇబ్బంది అవుతుందని తంగడపల్లికి చెందిన రోగి, ఛాతీ వ్యాధికి రక్తం సూదులు నిల్వ లేకపోవడంతో తాము హైదరాబాద్‌కు వెళ్లి కొనుగోలు చేయాల్సి వస్తున్నదని ఆరెగూడెంకు చెందిన రోగి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

☛ ఈ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న తమకు మూడు నెలలుగా గుత్తేదారు వేతనాలు ఇవ్వడం లేదని, అడిగితే ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాలేదని సమాధానమిస్తున్నాడని, దసరా పండుగ ఎలా జరుపుకోవాలని కలెక్టర్ ఎదుట పొరుగు సేవల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్‌లో.. ఎన్నో చిక్కులు

భువనగిరి, న్యూస్‌టుడే: లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల విచారణలో అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. డీటీసీపీ, వైటీడీఏ, హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా అక్రమంగా చేసిన వెంచర్లు, విక్రయించిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు వీలుకల్పించే విధంగా గత ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. రూ.వెయ్యి రుసుంతో ప్లాట్లు, రూ.10వేల రుసుముతో వెంచర్లను క్రమద్ధీకరించుకునేందుకు అవకాశం ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఎల్‌ఆర్‌ఎస్ జారీ ప్రక్రియ మూలకు పడగా.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వీటిని క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది.. జిల్లా వ్యాప్తంగా 2,12,971 దరఖాస్తులు వచ్చాయి.

☛ డీటీసీపీ, హెచ్ఎండీఏ, మున్సిపల్, వైటీడీఏ పరిధిలో అనుమతులు లేకుండా జిల్లాలో స్థిరాస్తి వ్యాపారులు వందల సంఖ్యలో వెంచర్లు చేసి లక్షల ప్లాట్లు విక్రయించి కోట్ల రూపాయలు దండుకున్నారు. వీటిని కొనుగోలు చేసిన ప్రజలు అనుమతులు లేని కారణంగా అమ్ముకోలేకపోతున్నారు.

☛ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అధికార యంత్రాంగం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల విచారణను చేపట్టింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ పర్యవేక్షణలో డీపీవో ఆర్.సునంద ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా దరఖాస్తుల పరిశీలన మొదలు పెట్టారు.

☛ ఎల్-1, ఎల్-2, ఎల్-3, ఎల్-4 నాలుగు దశల్లో విచారణ కొనసాగుతుంది. జిల్లాలో గ్రామ పంచాయతీలో వచ్చిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), నీటి పారుదల శాఖ ఇంజినీర్లు కలిసి ప్లాటు స్వరూపాన్ని పరిశీలిస్తారు.

☛ మున్సిపాలిటీ, హెచ్ఎండీఏ, వైటీడీఏ పరిధిలోని దరఖాస్తును ఆయా శాఖల అధికారులు పరిశీలించి అనుమతుల జారీ ప్రక్రియ చేపడతారు.

☛ ఆ ప్లాట్లలో ప్రభుత్వ భూమి, చెరువు, కుంటల శిఖం, బఫర్ జోన్, స్థానిక అవసరాలకు కేటాయించింది ఉంటే అనుమతులు ఇవ్వరు. అన్ని సక్రమంగా ఉంటే ఎల్-1 స్థాయిలో క్లియర్ చేసి, ఎల్-2 డీపీవో/డీఎల్‌పీవోలు పరిశీలన చేస్తారు. ఎల్-3లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తన లాగిన్‌లో వారు పంపిన వాటిని సరిచూసి, చివరి దశ ఎల్-3లో కలెక్టర్ అనుమతి జారీ చేస్తారు. నేరుగా దరఖాస్తు దారు చరవాణికి ఎంత రుసుం చెల్లించాలో చరవాణిలో సంక్షిప్త సందేశం ద్వారా సమాచారం వెళుతుంది.

వచ్చిన దరఖాస్తుల వివరాలు

జిల్లాలోని పురపాలికల్లో:	55,675
వైటీడీఏ పరిధిలో:	17,366
మొత్తం దరఖాస్తులు:	2,12,971
డీటీసీపీ పరిధిలో గ్రామాల్లో:	62,293
హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామాల్లో:	77,685
పరిష్కారం: సుమారు	3,000

అవాంతరాలు ఇలా...

మొత్తం 2,12,971 దరఖాస్తులు రాగా క్షేత్ర స్థాయి విచారణలో అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. పలువురు దరఖాస్తు చేసినా తాము కొనుగోలు చేసిన ప్లాటుకు సంబంధించిన లేఅవుట్ నకలు, ఈసీ కాపీలను జత పరచకపోవడంతో ప్లాటును గుర్తించలేకపోతున్నారు. మారుమూల ప్రాంతాల్లో చేసిన వెంచర్లు కనిపించకుండా పోయాయి. అవి ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడం పంచాయతీ కార్యదర్శులకు పెద్ద సవాల్‌గా మారింది.



బీబీనగర్ మండలం గొల్లగూడెంలో క్షేత్ర స్థాయికి వెళ్లి ప్లాట్ ఉందా లేదా పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్

వేగంగా నిర్వహించేందుకు చర్యలు :

కె.గంగాధర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

ఎల్‌ఆర్‌ఎస్ క్రతువును యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పది రోజులుగా జిల్లాలో విచారణ మొదలెట్టాం. దరఖాస్తుతో పాటు కావాల్సిన పత్రాలను జత చేయకపోవడంతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తక్కువున్న పత్రాలను వెంటనే పంపించాలని దరఖాస్తుదారుకు సమాచారం ఇస్తున్నాం.

యాదాద్రీశుడి క్షేత్రంలో దైవారాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో గురువారం ప్రధానాలయంలో నిత్యపూజలు కొనసాగాయి. పంచ నారసింహులను ఆరాధిస్తూ పూజలు పాంచరాత్రాగమ శాస్త్ర రీత్యా చేపట్టారు. సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ మహా ద్వారాలను తెరిచి మూలవరులకు హారతి నివేదన చేపట్టి, నిత్య ఆరాధనలకు శ్రీకారం చుట్టారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక తులసీ పత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి కవచమూర్తులకు స్వర్ణ పుష్పార్చన జరిపారు. ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులకు సువర్ణ పుష్పార్చన పర్వాన్ని కొనసాగించారు. ఉగ్ర నరహరిని కొలుస్తూ శ్రీసుదర్శన నారసింహహోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆలయ ఆచారంగా చేపట్టారు. కల్యాణ మూర్తులను గజవాహనంపై అలంకృతులను చేసి సేవా పర్వాన్ని నిర్వహించారు. సాయంత్రం అలంకార జోడు సేవలను మంగళ వాయిద్యాల మధ్య వేద మంత్రాలతో నిర్వహించారు. రాత్రి గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక ఆరాధన జరిపారు. దర్బార్ సేవోత్సవంలో నిత్య ఆదాయం వెల్లడించారు. గురువారం వివిధ విభాగాల ద్వారా రూ.13,40,391 ఆదాయం చేకూరింది. పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్య పూజలు ఆచారంగా కొనసాగాయి. చండీ హోమం, గాయత్రీ జపం చేపట్టారు.



యాదాద్రిలో చండీహోమం నిర్వహిస్తున్న యాజ్ఞికులు

పరిశ్రమలొస్తున్నాయ్..!

ఉమ్మడి జిల్లాలో విస్తరణ కోసం సర్కారుకు పలు కంపెనీల దరఖాస్తు

టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో భూ సేకరణ పూర్తి

తలసరి ఆదాయానికి సూచికలుగా భావించే పారిశ్రామికీకరణలో భాగంగా.. ఉమ్మడి జిల్లాలో పలు పరిశ్రమలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమవుతున్నాయి. సున్నపురాయి నిక్షేపాలున్న కృష్ణపట్టి ప్రాంతంలో సిమెంటు పరిశ్రమలు విస్తరణకు ప్రభుత్వానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకోగా.. రహదారి, రైలు, విమాన మార్గాలు అందుబాటులో ఉన్న రాజధాని సమీప ప్రాంతాల్లో ఫార్మా, పైపులు, ఇతర ఆహారశుద్ధి పరిశ్రమలను స్థాపించడానికి వ్యాపారవేత్తలు ఆసక్తి చూపిస్తున్నారు.

- ఈనాడు, నల్గొండ

★ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం సమీపంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా హరిత పారిశ్రామిక పార్కులో ఇప్పటికే 300లకు పైగా పరిశ్రమలు ఉత్పత్తులు ప్రారంభించాయి. త్వరలోనే మరిన్ని కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న వాటిలో పాలకవీడు మండలంలోని దక్కన్ సిమెంటు పరిశ్రమ రూ.1218 కోట్లతో విస్తరించడంతో పాటూ 320 మందికి ఉపాధి అవకాశాలు ఇవ్వనున్నట్లు తెలిపింది. మేళ్లచెరువు మండలంలో మైం హోం సిమెంటు పరిశ్రమ రూ.1500 కోట్లతో విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. దీని వల్ల 500 మందికి ఉపాధి లభించనుంది.

★ మరోవైపు హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి పక్కన నార్కట్‌పల్లి సమీపంలో రూ.301 కోట్లతో మహారాష్ట్ర కేంద్రంగా పనిచేసే సీమ్‌లెస్ లిమిటెడ్ పైపుల తయారీ కంపెనీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీని వల్ల 200 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. తొలి దశలో ఈ మూడు కంపెనీలు ఉమ్మడి జిల్లాలో రూ.3,019 కోట్లతో 1020 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయి. మలి దశలో మరిన్ని ఆహారశుద్ధి పరిశ్రమలు దామరచర్ల, మిర్యాలగూడ, నల్గొండ, సూర్యాపేట ప్రాంతాల్లో స్థాపనకు ప్రభుత్వానికి దరఖాస్తులు సమర్పించనున్నట్లు తెలిసింది.

★ ప్రభుత్వం సదరు కంపెనీల దరఖాస్తులకు ఆమోదం తెలిపితే మెగా ప్రాజెక్టు కింద అవి వెచ్చించే పెట్టుబడిలో 30 శాతం రాయితీ లభించనుంది. భూ కేటాయింపుల్లో రాయితీతో పాటూ స్టాంప్, ట్రాన్స్‌ఫర్, రిజిస్ట్రేషన్ ఫీజులకు మినహాయింపు ఉంటుంది. వీటితో పాటూ విద్యుత్ సబ్సిడీ, వడ్డీ రాయితీలు సైతం షరతులతో వర్తిస్తాయి.

పారిశ్రామిక పార్కుల సంగతో..?

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, మఠంపల్లి, చిట్యాలలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) భూములను సేకరించింది. సూర్యాపేట, మిర్యాలగూడల్లో ఆటోనగర్ పేరిట భూములను సైతం సేకరించారు. మిర్యాలగూడ గ్రామీణ, దామరచర్ల మండలాల్లో ఆహారశుద్ధి పరిశ్రమలకు సైతం భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పుడు వాటిల్లో కార్యకలాపాలు ప్రారంభిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు దక్కేందుకు ఆస్కారం ఉంటుంది.

★ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్న కంపెనీలతో పాటూ ప్రభుత్వ హయాంలో కంపెనీలు నెలకొల్పడానికి కేటాయింపులు చేసిన భూముల్లో కంపెనీలు నెలకొల్పి ఉత్పత్తులు ప్రారంభిస్తే యువతతో పాటూ స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభిస్తాయి. దీనిపైనా మూడు జిల్లాల అధికార యంత్రాంగాలు సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

పురపాలికల్లో ముందుచూపుతో

తాగునీటి వసతి కల్పన

మోత్కూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని 28 పురపాలికల్లో 30 ఏళ్ల ముందుచూపుతో తాగునీటి వసతి కల్పనకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద మంజూరు చేసిన రూ.1,768 కోట్లతో పనులు చేపట్టినట్లు ప్రజారోగ్య శాఖ ఉమ్మడి జిల్లా ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మోత్కూరులో చేపట్టిన ప్రధాన రహదారి విస్తరణ పనులు, తాగునీటి ట్యాంకుల నిర్మాణం, మురుగుకాల్వలు, సిమెంట్ రహదారుల నిర్మాణ పనులను డీఈఈ మనోహర, పుర కమిషనర్ సి.శ్రీకాంత్‌తో కలిసి ఎస్ఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో 19 పురపాలికలకు నిధులు మంజూరు కాగా, చిట్యాల, నేరేడుచర్లలో పనులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. నల్గొండ, సూర్యాపేట, మిర్యాలగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ పనులు రెండేళ్లల్లో పూర్తిచేయాల్సి ఉందన్నారు. పనులు చేసిన గుత్తేదారు ఐదేళ్ల పాటు తాగునీటి సరఫరా, మురుగుకాల్వల నిర్వహణ చేయాలని పేర్కొన్నారు. తాగునీటి పైపులైన్ల విషయంలో అవసరమైన చోట పాత పైపులైన్లను తొలగించి, కొత్తవి నిర్మిస్తామని వివరించారు. మోత్కూరులో పదిన్నర కి.మీ. మేర పైపులైను నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఆయన వెంట ఏఈ సురేష్, డాక్టర్ జి.లక్ష్మీ నర్సింహారెడ్డి ఉన్నారు.



మోత్కూరులో ప్రధాన రహదారి పనులు పరిశీలిస్తున్న ప్రజారోగ్య శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు

దారంతా పూలవనమే బతుకమ్మ.. మాతోడు నువ్వుండి పోవే బతుకమ్మ...

మోతెలో బతుకమ్మల వద్ద మహిళల సందడి






నూతనకల్ మండలకేంద్రంలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్లలో తీరొక్క పూలతో...



ఆన్‌లైన్ లోకంలో.. ఆఫ్‌లైన్ కథలు



జానకీరామ్ రచించిన కథల పుస్తకం


కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ముక్కాముల జానకీరామ్ తెలుగు సాహిత్యంలో కవితలు, పాటలు, కథలు రాస్తూ అవార్డులు పొందుతున్నారు. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలానికి చెందిన ఆయన ఆఫ్‌లైన్, ఏడు రంగుల వాన వంటి కథల పుస్తకాలు, 100కు పైగా కథలు రాశారు. ఇప్పటికే యూట్యూబ్‌లో మూడు పాటలు విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్ సారస్వత పరిషత్ వారు రచయితలకు నిర్వహించిన కథల పోటీల్లో అవార్డు సాధించారు. నేడు బాలల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లోనే గడుపుతున్నారు. ఆన్‌లైన్‌కు దూరం చేయాలనే ఉద్దేశంతో 'ఆఫ్‌లైన్' కథల పుస్తకాన్ని రచించారు. చరవాణితో కలిగే నష్టాలను ప్రస్తావిస్తూ 22 కథలు రాశారు. 27 కథలతో 'ఏడు రంగుల వాన' పుస్తకాన్ని ప్రచురించారు. మేళ్లచెరువు ఉన్నత పాఠశాలలో పనిచేసే సమయంలో విద్యార్థులతో 33 కథలు రాయించి 'ఊహలకు రెక్కలొస్తే' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇది సూర్యాపేట జిల్లాలోనే మొదటి బాలల కథల పుస్తకం.



- విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను, నైతిక విలువలను పెంపొందించడమే తన ఉద్దేశమని **జానకీరామ్** తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వీయరచనా సామర్థ్యాలను పెంపొందించడం, భావి రచయితలను సమాజానికి అందించడమే లక్ష్యంగా విద్యార్థులతో కథలు రాయిస్తున్నట్లు చెప్పారు.

బంధాలు గుర్తుంటే.. ప్రతిరోజూ పండగే





నాంపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండగ దసరా. . పండగ సెలవుల సందర్భంగా పట్టణాల్లో స్థిరపడిన కుటుంబాలు పల్లెబాట పడుతున్నాయి. పల్లె ప్రాంగణాల్లో కొంత సందడి నెలకొంటోంది. ఒకప్పుడు పండగ సెలవులు తాత, అమ్మమ్మ, నాయనమ్మ, మనుమలు, మనుమరాళ్ల కబుర్లతో ఎంతో సంతోషంగా గడిచేవి. అప్పటి రోజుల్లో పండగ వచ్చిందంటే పంట పొలాలు, చెరువుగట్లు, తోటల్లో చెట్ల కింద సేద తీరుతూ ప్రకృతి అందాలను ఆస్వాదించేవారు. నిండైన వెన్నెల కాంతుల్లో ఆరుబయట పిల్లలు.. పెద్దలూ కబుర్లతో కాలక్షేపం చేసేవారు. కాల క్రమేణా పండగలు కళను కోల్పోతున్నాయి. అందరూ కలిసినా ఎవరికి వారు ఒంటరిగా ఉంటూ సెల్‌ఫోన్లూ.. కంప్యూటర్లతోనే గడుపుతున్నారు. నేటి ఈ ఆధునిక జీవన తీరు చూస్తుంటే పూర్వకాలంలోని అను'బంధాలు' గుర్తుచేసుకోక తప్పదు.

పండగ అంటే అయినవారం దరూ కలుసుకోవటం.. ఆనందాలను పంచుకోవటం.. గత స్మృతులను నెమరు వేసుకోవటం.. పది కాలాలపాటు పదిలపరుచుకునే మరిన్ని అనుబంధాలను మూటకట్టుకోవటం.. పండగ పూట ఇలాంటి మధురిమలు పొందాలంటే.. బంధుమిత్రులూ.. ఆత్మీయులందరితోనూ మమేకమవ్వండి.. పాలపిట్టను చూడండి... జమ్మిపూజలో పాల్గొనండి.. జ్ఞాపకాలను మదిలో పదిలపర్చుకోండి.. ఆ అనుబంధాలతో పంచుకున్న ఆనందమే పరిపూర్ణమైన దసరా పండగ..

దినపత్రికలు, పుస్తక పఠనంతో జ్ఞానసముపార్జన..

అంతర్జాలం పుణ్యామా అని దినపత్రికలు, పుస్తక పఠనం పూర్తిగా తగ్గిపోయింది. ఎంత సేపూ సెల్‌ఫోన్లూ.. సామాజిక మాధ్యమాలను అనుసరించడానికి ఆసక్తి చూపుతున్నారు. వాటివల్ల అవగాహన స్థాయి పెరగదు.. అనుభూతి కలగదు.. జ్ఞాపకశక్తి పెంపొందదు. పైగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అదే ఏదైనా ఓ మంచి పుస్తకం, దినపత్రికలు చదివితే కలిగే అనుభూతి వేరు. ఇటీవల దినపత్రికల్లోనూ చాలా మార్పులొచ్చాయి. సూటిగా, స్పష్టంగా తక్కువ వాక్యాల్లోనే కీలక విషయాలు, భావాలను చెబుతున్నాయి. వీటి వల్ల సామాజిక పోకడ అవగతమవుతుంది. వివేకం పెంపొందుతుంది. పండగ సెలవుల్లో సెల్‌ఫోన్ ప్రాధాన్యత తగ్గించండి. . పుస్తక పఠనంపై దృష్టి మరల్చండి.

ఆచరిస్తే.. ఆనందాలే..



పల్లెలకు వస్తున్న పిల్లలూ.. పెద్దలు.. దసరా సెలవులను తాతయ్య, అమ్మమ్మ, నాయనమ్మలతో ఆనందంగా గడపండి. పచ్చని పొలాలు, పంట కాల్వలు, పూల తోటల్లో విహరించి, ప్రకృతి అందాలను ఆస్వాదించండి. పల్లె ప్రకృతిని ఆకళింపు చేసుకోండి. పుట్టిపెరిగిన ఊరిని పరికించి, జన్మనిచ్చిన తల్లిదండ్రులను, వారిని కన్న పెద్దలనూ గుండెలకు హత్తుకోండి. ఉన్న వారం ఇంటిల్లిపాదితో సంతోషంగా గడిపి చక్కని అనుభూతి మూటకట్టుకోండి. ఇలాగైతే మునుపెన్నడూ లేని రీతిలో పండగ ఆనందాలు వెల్లివిరుస్తాయి..! ఆ జ్ఞాపకాలు గుర్తు చేసుకునే ప్రతి రోజూ పండగను తలపిస్తుంది.

బంధుమిత్రులతో కులాసా కబుర్లు..



ఈ కాలంలో అయిన వారితో కబుర్లు మాటలు, యోగక్షేమాలు, పలకరింపులు చరవాణికే పరిమితమయ్యాయి. వ్యక్తిగతంగా వారిని కలవడం, ఆనందాలను పంచుకోవడం పూర్తిగా తగ్గిపోయింది. దసరా పండగ సెలవు రోజుల్లో సాధ్యమైనంత వరకు చరవాణికి దూరంగా ఉండండి. గ్రామంలోని బంధుమిత్రులను కలవండి. ఆనందంగా వారితో గడపండి. ఆ జ్ఞాపకాలు మళ్లొచ్చే దసరా వరకు పదిలంగా ఉంచుకోండి.



విజేతలైన విద్యార్థులతో వారి తల్లిదండ్రులు

నయనానందం.. నృత్యాభినయం

కోదాడ, న్యూస్‌టుడే:



ఈ రోజుల్లో పిల్లలు పాఠశాలలకు వెళ్లి విద్యనభ్యసించాలంటేనే బద్ధకంగా ఉంటారు. కానీ కొందరు విద్యార్థులు చదువులో రాణిస్తూ ప్రపంచ రికార్డులు సాధిస్తున్నారు. ఇటీవల అంతర్జాతీయ కర్నాటిక్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్, కాశీ విశ్వనాథుని దేవాలయ కమిటీ నిర్వాహకులు, తమిళనాడు ప్రభుత్వం సంయుక్తంగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 15 మంది పాల్గొని ప్రపంచ రికార్డులు సాధించడం విశేషం.

15 మంది.. 12 రికార్డులు..

భరతనాట్యంలో భాగంగా రావణాసురుడు రచించిన రావణాకృత శివతాండవం స్తోత్రం అనే నృత్య పోటీలను మొదటిసారి నిర్వహించారు. పోటీల్లో భాగంగా ఆన్‌లైన్ విధానంలో 8 నిమిషాల పాటు నృత్యం చేయాల్సి ఉంటుంది. సుమారు 10 వేల మంది పాల్గొన్నారు. కోదాడకు చెందిన నాట్య గురువు తిరుపతి స్వామి శిష్య బృందం నుంచి 15 మంది పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారు. వీరందరూ నృత్యంలో ప్రతిభ కనబరచడంతో కాశీ విశ్వనాథుడి దేవాలయం, తమిళనాడు ప్రభుత్వం నుంచి అవార్డులు రావడంతో పాటు 12 ప్రపంచ రికార్డులు సాధించారు.

రెండు నెలలు కష్టపడ్డాం: పోతుగంటి తపస్య

పోటీల కోసం రెండు నెలల పాటు కష్టపడ్డాం. నిత్యం సాధన చేసి విజయం సాధించాం. ఆన్‌లైన్ విధానంలో ప్రదర్శన చేసిన తర్వాత కూడా నమ్మకం లేదు. పోటీల అనంతరం అవార్డులు రావడంతో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

అవార్డులు రావడం ఆనందంగా ఉంది: సోమా వెంకటశ్లోక



కొన్నేళ్లుగా కోదాడ పట్టణంలో భరతనాట్యం, శాస్త్రీయ నృత్యాలు నేర్చుకుంటున్నాం. మొదటి సారి కాశీ విశ్వనాథుడి ఆలయం వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొని, మెరుగైన ప్రదర్శన ఇచ్చాం. అవార్డులు సాధించడం ఆనందంగా ఉంది. దీంతో భరతనాట్యంలో మరింత ఎత్తుకు ఎదగాలని ఉంది.



రోజుకు రెండు గంటలపాటు సాధన: యర్రంశెట్టి శ్రేష్ఠ

నిత్యం పాఠశాలకు వెళ్తూనే రోజుకు రెండు గంటల పాటు భరతనాట్యం నేర్చుకుంటున్నా. ఎనిమిది నిమిషాల పాటు ఆన్‌లైన్ విధానంలో ప్రదర్శన చేయాలంటే మొదట్లో భయమేసింది. కానీ మెరుగైన ప్రదర్శన ఇవ్వడంతో పలు రికార్డులు రావడం ఆనందానిచ్చింది.

ప్రభుత్వ విద్యను కాపాడేందుకు కృషి చేస్తా: అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం.. ప్రభుత్వ విద్యను కాపాడేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. వరంగల్-నల్గొండ-ఖమ్మం ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా టీఎస్‌యూటీఎఫ్ రెండోసారి తన పేరు ప్రకటించడంతో గురువారం నల్గొండలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు, మద్దతు ఇచ్చే ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను నమోదు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి మాట్లాడుతూ అలుగుబెల్లి నర్సిరెడ్డి సేవలకు గుర్తింపుగా మరో సారి పోటీకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సాయిలు, తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య, తెలంగాణ పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎండీ.నజీమొద్దీన్, విశ్రాంత ప్రొఫెసర్ అక్కెనపల్లి మీనయ్య, టీఎస్‌యూటీఎఫ్ మైనారిటీ గురుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, శశిధర్, విజయ్, డా.శ్రీధర్‌కుమార్ లోథ్ తదితరులు అలుగుబెల్లి నర్సిరెడ్డికి మద్దతు ప్రకటించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాములు, నాగమణి, రాజశేఖర్‌రెడ్డి, సైదులు, వెంకటేశం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, చావ రవి, జంగయ్య


మధురం.. సీతాఫలం



తుర్కపల్లి, న్యూస్‌టుడే: సీతాఫలం మార్కెట్లోకి వచ్చేసింది. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు వరకు ఇవి సమృద్ధిగా లభిస్తాయి. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభిస్తాయి. ప్రతిఏటా ఈ పండ్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో తోటలు పెట్టి కూడా పండిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సీతాఫలాలకు ప్రసిద్ధి. ప్రధానంగా తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజపేట, భువనగిరి, బీబీనగర్, ఆత్మకూరు, యాదగిరగుట్ట, వలిగొండ ప్రాంతాల నుంచి సీతాఫలాలు పట్టణాలకు ఎగుమతి అవుతుంటాయి.

★ వర్షాకాలంలో రైతులు సీతాఫలాల విక్రయంతో ఉపాధి పొందుతూ ఉంటారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పక్షం రోజుల నుంచి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి పట్టణాలకు తరలిస్తున్నారు. గంప సైజుని బట్టి రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. యాదాద్రి జిల్లాతో పాటు సరిహద్దు ప్రాంతమైన సిద్దిపేట జిల్లా గజ్వేల్, జగదేవ్‌పూర్, మర్కుక్ ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు పండ్లను కొనుగోలు చేసి వాహనాలలో తుర్కపల్లి మండలం మీదుగా జిల్లా కేంద్రంతో పాటు ఇతర ముఖ్య పట్టణాలకు తరలిస్తున్నారు.

అంతరిస్తున్న వృక్షాలు... రియల్ వ్యాపారం కారణంగా సీతాఫలం వృక్షాలు తగ్గిపోతున్నాయి. దిగుబడి కూడా ఏటా తగ్గిపోతోంది. పండ్లను అధిక ధరలు పెట్టి కొనుకోవాల్సి వస్తోంది.ఏటా సీతాఫలాల మాధుర్యాన్ని ఆస్వాదించే వారికి వృక్షాలు కనుమరుగవుతుండటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఒకప్పుడు గుట్టల్లో, చెలకల్లో ఎక్కడ పడితే అక్కడ సీతాఫలం వృక్షాలు కనిపించేవి. దారిన వెళుతుంటే ఎంతో సువాసనవచ్చేవి. ఇప్పుడు దారుల వెంట వృక్షాలు కనిపించడం లేదు. భావి తరాల కోసం వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



ధైర్యలక్ష్మిగా పద్మావతి అమ్మవారు

భువనగిరి, న్యూస్‌టుడే: భువనగిరి స్వర్ణగిరి క్షేత్రంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజైన గురువారం శ్రీపద్మావతి అమ్మవారు ధైర్యలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు. సహస్రదీపాలంకార సేవలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

దేవీ నవరాత్రోత్సవాల్లో అలంకార సంబరం




యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలోని అనుబంధ శివాలయంలో కొనసాగుతున్న శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అలంకరణ జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంకార సంబురాలతో పాటు, లలితా సహస్రనామార్చన జరిపారు.

ఒక రోజు కస్టడీకి అనుమతి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా ఇతరుల పేర్ల మీదకు మార్పిడి చేసి రైతుబంధు నిధులు కాజేసిన కేసులో అరెస్టయిన అప్పటి హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీని విచారించేందుకు పోలీసులు ఐదు రోజుల కస్టడీ కోరగా.. హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ ఒకరోజు కస్టడీకి అనుమతించారు. తాము అరెస్ట్ చేసిన సమయంలో జయశ్రీ పూర్తిగా సహకరించనందున అన్ని వాస్తవాలు తెలుసుకునేందుకు ఐదు రోజులు కస్టడీకి అనుమతించాలని కోరుతూ హుజూర్‌నగర్ పోలీసులు గురువారం పిటిషన్ వేశారు. అదే విధంగా జయశ్రీకి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె తరపున న్యాయవాది బెయిల్ పిటిషన్ వేశారు. న్యాయమూర్తి మొదట పోలీస్ కస్టడీ పిటిషన్‌పై వాదనలు విన్నారు. అనంతరం ఐదు రోజుల కస్టడీ కాకుండా ఒక రోజు కస్టడీకి అనుమతిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 11న ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విచారణకు అనుమతించారు. పోలీస్ కస్టడీకి అనుమతించినందున బెయిల్ పిటిషన్ వాయిదా వేశారు. కోర్టుకు రెండు రోజులు సెలవులు ఉండటం వల్ల బెయిల్ పిటిషన్‌పై వాదనలు సోమవారం జరిగే అవకాశం ఉంది.

సీపీఎం నేత సీతారాములుకు మాతృవియోగం



సీతారాములు తల్లి లక్ష్మమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల, న్యూస్‌టుడే: సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తల్లి లక్ష్మమ్మ(96) వృద్ధాప్యంతో గురువారం హైదరాబాద్‌లోని నివాసంలో మరణించారు. లక్ష్మమ్మ అంత్యక్రియలు నల్గొండ జిల్లా చిట్యాలలో నిర్వహించారు. లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించడానికి వచ్చిన తన చిరకాల మిత్రుడు, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని చూడగానే సీతారాములు భావోద్వేగానికి లోనై ఏడ్చారు. లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించిన వారిలో సుఖేందర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే వేముల వీరేశం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, వ్యకాసం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, నల్గొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎండీ అక్బర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు.

వ్యర్థాలలో.. అర్థం వెతికి..!

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మనం సౌకర్యం కోసం ప్లాస్టిక్ చేతిసంచులు వాడి అవసరం తీరగానే అవతల పారేస్తాం. నీళ్ల సీసా కొనుక్కుని తాగి అవతలికి విసిరేస్తాం. దుకాణం నుంచి పాలు, నూనె ప్యాకెట్లు తెచ్చి ఖాళీ కాగానే చెత్త కుండీలో వేసేస్తాం. ఇళ్లలో వాడేందుకు ప్లాస్టిక్ బకెట్లు, కుర్చీలు కొంటాం. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ ఏమవుతున్నాయి? వందల ఏళ్లయినా పాడైపోవు, కుళ్లిపోవు, మట్టిలో కరిగిపోవు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలతోనే వ్యాపారం చేయవచ్చునని ఆలోచించారు కొయ్యలగూడానికి చెందిన చేనేత కార్మికుడు రాపోలు సైదులు, అతని భార్య కవిత. చౌటుప్పల్‌లో వీరి కుమార్తె అనూహ్య పేరిట 'అను ప్లాస్టిక్స్' పద్నాలుగేళ్ల క్రితం ప్రారంభించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వీరు రోజుకు వెయ్యి కిలోలు చొప్పున ఇప్పటికి 50 లక్షల 40 వేల కిలోలు సేకరించారు. వాటిని యంత్రాల్లో వేసి గ్రైండింగ్, ప్రెస్సింగ్ చేసి పునరుత్పత్తి కేంద్రాలకు తరలించారు. పర్యావరణానికి ఎంతో మేలు చేసే ఈ వ్యాపారంతో ప్రత్యక్షంగా ఎనిమిది మందికి, పరోక్షంగా 30 మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరి సేవకు గుర్తింపుగా స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో పురపాలిక ద్వారా ప్రశంసాపత్రాన్ని అందించి సన్మానించారు.

మాకు ఉపాధి...పర్యావరణానికి మేలు

– రాపోలు సైదులు, కవిత, కొయ్యలగూడెం

మా నాన్న రాపోలు నర్సింహ దగ్గర చేనేత పని నేర్చుకున్నా. పేదరికం వల్ల పదో తరగతి పూర్తి కాగానే చదువు మాన్పించి మగ్గం నేయడానికి కుదురుకున్నా. పద్నాలుగేళ్ల పాటు మగ్గంపై నేత పని చేశాను. వస్త్రాలు అమ్ముడుపోక పని దొరకడం కష్టమైంది. అప్పటికే ముగ్గురు సంతానం. చేనేత వృత్తి పనిని వదిలేశాను. నా బావమర్ది శ్రీనివాస్ ప్లాస్టిక్ వ్యర్థాలతో వ్యాపారం చేయవచ్చని ఆలోచన చెప్పాడు. రూ.ఆరు లక్షలతో ప్లాస్టిక్ గ్రైండింగ్, ప్రెస్సింగ్ చేసే యంత్రాలు కొనుగోలు చేసి తెచ్చాం. సుమారు 30 మంది నిత్యం ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి సుమారు వెయ్యి కిలోల వరకు మా దగ్గరికి తీసుకొచ్చి అమ్ముతున్నారు. వారికి రోజూ సగటున రూ.300 ఆదాయం వస్తుంది. మా షెడ్డులో ఆరుగురిని ఉద్యోగులుగా నియమించుకున్నాం. వాళ్లతో మేము కొనుగోలు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను కవర్లు, నీళ్ల సీసాలు, మందంగా ఉండే డబ్బాలు, కుర్చీలు, టేబుళ్లు ఇలా 21 రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను రంగుల వారీగా వేరు చేయిస్తాం. నీళ్ల సీసాలను ప్రెస్సింగ్ చేస్తాం. ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను రకం, రంగుల వారీగా గ్రైండింగ్ మిషన్‌లో చిప్స్ మాదిరిగా ముక్కలు చేసి సంచుల్లో నింపుతాం. వీటిని హైదరాబాద్ కాటేదాన్‌లో రీసైక్లింగ్ చేసే కంపెనీలకు సరఫరా చేస్తున్నాం. దీంతో మాకు స్వయం ఉపాధి లభిస్తుంది. ఇతరులకు ఆదాయం లభిస్తుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. ఈ వ్యాపారంతోనే మా ముగ్గురు పిల్లలను ఇంజినీరింగ్, డిగ్రీ విద్య చదివిస్తున్నాం.




తాగి పడేసిన ప్లాస్టిక్ నీళ్ల సీసాలను యంత్రంతో ప్రెస్సింగ్ చేస్తున్న రాపోలు సైదులు, కవిత దంపతులు

చికెన్ ధరలు

ఫాంరేటు	109–00
రిటైల్	131–00
డ్రెస్డ్	190–00
స్కిన్‌లెస్	216–00

కొలువు దీరిన పేదలు



ప్రభుత్వ కొలువు సాధించాలన్నది తల్లిదండ్రుల కల. వారి ఆశయ సాధనకు తనయులు కష్టపడి పరీక్షలకు సన్నద్ధమయ్యారు. అవకాశాన్ని అందిపుచ్చుకొని ప్రభుత్వ కొలువు సాధించారు. తల్లిదండ్రుల కలను నిజం చేశారు. ఇటీవల వెల్లడైన డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటి కొలువు సాధించిన యువత విజయగాథపై 'న్యూస్‌టుడే' కథనం.
– మోత్కూరు, న్యూస్‌టుడే

తల్లిదండ్రుల కోరిక నెరవేర్చా..



– కడారి సైదులు, పొనాయికుంట, అడ్డగూడూరు మండలం

మాది కూలీనాలీ చేసుకుని బతికే కుటుంబం. అమ్మానాన్నలు ప్రభుత్వ ఉద్యోగం చేయాలన్న కోరికతో నన్ను ఎంతో కష్టపడి చదివించారు. పదో తరగతి గణితం పరీక్ష రాస్తున్న సమయంలో అమ్మ మల్లమ్మ అనారోగ్యంతో చనిపోయారు. పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు హాజరయ్యాను. ఏపీపీఎస్సీ ద్వారా వీఆర్‌ఏగా నియమకమయ్యాను. వీఆర్‌ఏల క్రమబద్ధీకరణలో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై మోటకొండూరు తహసీల్ కార్యాలయంలో పనిచేశాను. ఉపాధ్యాయుడిని కావాలన్న లక్ష్యంతో డీఎస్సీ రాసి ఎస్జీటీ విభాగంలో జిల్లా 29వ ర్యాంకు సాధించాను. అమ్మానాన్నల ఆశయం నెరవేర్చానన్న సంతోషంలో ఉన్నాను.

భర్త తోడ్పాటుతో..



– అరూరు శోభారాణి, దుప్పెల్లి, వలిగొండ మండలం

నాన్న చిట్టెలపల్లి నర్సయ్య, అమ్మ సావిత్రమ్మలకు ఐదుగురు ఆడపిల్లలం. నేను మూడో అమ్మాయిని. నాన్న ఉపాధ్యాయుడు కావడంతో మమ్మల్ని ఎలాగైనా ఉపాధ్యాయులుగా చూడాలన్న కోరికతో చదివించారు. 2014లో పెళ్లి. కుమారుడు, కుమార్తె సంతానం. భర్త అరూరు వెల్లయ్య ఉపాధ్యాయుడు. ఆయన తోడ్పాటుతోనే ఉపాధ్యాయురాలిని కావాలని పోటీపరీక్షలకు హాజరయ్యాను. పిల్లలను చూసుకుంటూనే రోజూ 8 గంటలు కష్టపడి చదివాను. డీఎస్సీకి హాజరై ఎస్జీటీలో 74వ ర్యాంకు సాధించాను. అమ్మానాన్న, భర్త ఆకాంక్షను నెరవేర్చినందుకు సంతోషంగా ఉన్నాను.

ఉపాధ్యాయునిగా చూడాలని..



– ఎన్నారం ఉమేష్‌చంద్ర, జానకిపురం, అడ్డగూడూరు మండలం

నాన్న సత్యయ్య ఉపాధ్యాయుడు. అమ్మ పద్మ. నన్ను ఉపాధ్యాయుడిగా చూడాలన్నదే వారి ఆకాంక్ష. వారి ఆశీస్సుల మేరకే బాగా చదువుకున్నా. డీఎస్సీకి హాజరై ఎస్జీటీలో జిల్లాలో రోస్టర్ 4వ ర్యాంకు సాధించాను. ఉపాధ్యాయుడిని అవుతున్నందుకు అమ్మానాన్నలు ఎంతో సంతోషిస్తున్నారు.

కూరగాయలు పండించి చదివించారు..



– అన్నెపు క్రాంతి, మోత్కూరు

అమ్మ అన్నెపు సునీత, నాన్న నర్సింహాలు పొద్దంతా కష్టపడి కూరగాయలు పండిస్తారు. వ్యవసాయ పనుల్లో నేనూ పాల్గొనేదాన్ని. తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకే డీఎస్సీకి హాజరై ఎస్జీటీలో 47వ ర్యాంక్ సాధించాను. ప్రభుత్వ పాఠశాలల్లో పేదలకు మంచి విద్యనందించేందుకు కృషి చేస్తాను.

అమ్మానాన్నల కష్టాన్ని వమ్ము చేయకుండా..



– మాతంగి అశోక్, అనాజిపురం

మాది నిరుపేద కుటుంబం. అమ్మానాన్నలు కూలీపని చేసి నన్ను చదివించారు. ఇంటర్ తర్వాత కూలీపనులకు వెళ్లాను. తట్టమోయడం, దున్నడం తదితర మట్టి పనులు చేశాను. ప్రైవేట్ పాఠశాలల్లో ఆరేళ్లకు పైగా ఉపాధ్యాయుడిగా పనిచేశాను. మా అమ్మ ఎల్లమ్మ, నాన్న ఎల్లయ్య, అన్న నర్సయ్యలు బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం చేయాలని నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. వారి ఆకాంక్ష మేరకే బాగా చదువుకున్నాను. డీఎస్సీలో జిల్లాలో 55వ ర్యాంక్ సాధించి స్కూల్ అసిస్టెంట్ (సోషల్)కు ఎంపికయ్యాను.

వ్యవసాయ పనులు చేసి..



– గొడిశాల నాగరాజు, జానకిపురం, అడ్డగూడూరు మండలం

నాన్నతో పాటు వ్యవసాయ పనులు చేస్తూనే చదువుకున్నా. పదో తరగతి వరకు గోవిందాపురంలో చదివాను. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ చేశాను. ఉపాధ్యాయుడిని కావాలన్న అమ్మ పుష్పనీల, నాన్న సోమయ్యల ఆకాంక్ష మేరకు ఎస్జీటీ విభాగంలో 26వ ర్యాంక్ సాధించాను. ఉపాధ్యాయుడిని అవుతున్నందుకు అమ్మానాన్నలు ఎంతో సంతోషంగా ఉన్నారు.

గురుస్వామి హఠాన్మరణం

భువనగిరి, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణానికి చెందిన గురుస్వామి తోట ప్రకాష్(70) హఠాన్మరణం చెందారు. గురువారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. గత కొన్నేళ్లుగా భువనగిరిలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో అయ్యప్ప దీక్ష మాలధారులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. తోట భాగ్యవతి, రామానుజం సేవా సంస్థ ఏర్పాటు చేశారు. ట్రస్ట్ సభ్యులు, అయ్యప్ప భక్తులు సంతాపం వ్యక్తం చేశారు. తోట ప్రకాష్ గురుస్వామి అంత్యక్రియలు గురువారం సాయంత్రం పట్టణంలో జరిగాయి.

విద్యుత్తు నియంత్రికల చోరీ

వలిగొండ, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికల చోరీ జరిగిన ఘటన మండలంలోని ఏదుల్లాగూడెం గ్రామ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఏదుల్లాగూడెం గ్రామానికి చెందిన బండిగారి మైసయ్య వ్యవసాయ క్షేత్రంలో ఉన్న రెండు విద్యుత్తు నియంత్రికలను గుర్తుతెలియని దుండగులు అపహరించారు. ఉదయం రైతులు వెళ్లి చూసే సరికి విద్యుత్తు నియంత్రికలు లేకపోవడంతో డిస్కం ఏఈ మచ్చేందర్‌కు సమాచారం ఇచ్చారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగేంధర్ గురువారం తెలిపారు.

ఆలయంలో..

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని నమాత్‌పల్లి పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు జోషి పవన్‌కుమార్‌శర్మ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ఏడు గంటలకు పూజలు ముగించుకొని తాళం వేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం అటెండర్ తాళం తీసి గమనించగా హుండీ పగులగొట్టి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తుర్కపల్లి, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తక్యూద్దీన్ తెలిపారు. బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ముల్కలపల్లి పెట్రోల్ బంకు వద్ద గురువారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా 40 క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు చెప్పారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న మహేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆహ్లాదకరమైన ఆలోచనలతో మానసిక దృఢత్వం



మాట్లాడుతున్న వైద్యకళాశాల ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎమ్.రాజారావు

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: ఆహ్లాదకరమైన ఆలోచనలతో వృత్తిపై ఒత్తిడి లేకుండా మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలని జిల్లా వైద్య కళాశాల ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎమ్.రాజారావు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో గురువారం సైకియాట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఉద్యోగ నిర్వహణలో మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత' అనే అంశంపై మాట్లాడారు. మానసిక స్థితి సరిగా ఉన్నప్పుడు పనిమీద ఏకాగ్రత ఉంటుందన్నారు. కార్యక్రమంలో సైకియాట్రీ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష, చిన్నపిల్లల వైద్యనిపుణురాలు డాక్టర్ నిర్మల, గైనకాలజిస్టు ఇందిరా, కంటి వైద్యుడు డాక్టర్ రాజలింగం, వైద్యులు వెంకటకృష్ణ, మధురిమ, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే ప్రమాదాలు



అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

ఆలేరు, న్యూస్‌టుడే: నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(టీటీఐ) ఎస్సై నర్సింహరావు అన్నారు. ఆలేరులో గురువారం టీటీఐ ఆధ్వర్యంలో వాహన చోదకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీటీఐ ఏఎస్ఐ సోమనాథ్, రవికుమార్, శంకర్‌గాంధీ, నర్సింహ తదితరులు ఉన్నారు.

దాత సహకారంతో పాఠశాలలో వసతులు

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలం సాయిగూడెంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు దాత సహకారంతో వసతులు సమకూరాయి. గ్రామానికి చెందిన బయ్య జ్ఞానేందర్ వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కరోనా సమయంలో గ్రామానికి వచ్చినప్పుడు పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణంలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉండడాన్ని చూశారు. ఇటీవల రూ.5 లక్షల సొంత నిధులతో పాఠశాల ఆవరణ శుభ్రం చేయించారు. మొరం మట్టి పోయించారు. పాఠశాల పిల్లలతో పాటు గ్రామ యువకులు ఆడుకునేందుకు కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్ కోర్టులు ఏర్పాటు చేయించారు.



చదును చేసి మొరంపోసిన అనంతరం పాఠశాల ఆవరణ ఇలా..



శ్రీచక్ర ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం..

తొమ్మిది అడుగుల శ్రీచక్ర ప్రతిష్ఠాపన

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నాగిరెడ్డిపల్లి శివారులోని శివశక్తి శిరిడిసాయి అనుగ్రహ మహాపీఠం(రమణేశ్వరం)లో గురువారం బాలా త్రిపుర సుందరి అమ్మవారి పేరున తొమ్మిది అడుగుల శ్రీచక్రాన్ని సిద్ధగురు రమణానంద మహర్షి ప్రతిష్ఠించారు. శ్రీచక్రాలయంలో మహారుద్రుని తొమ్మిది అడుగుల పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఇప్పటి వరకు 1022 శ్రీచక్రాలు, 33 శివలింగాలు, దేవతామూర్తుల ప్రతిష్ఠాపనలు, నేత్రబంధనం పూర్తయినట్లు మహర్షి చెప్పారు.

ప్రాంతీయ రింగు రోడ్డు మార్చాలని వినతి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ప్రాంతీయ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో చౌటుప్పల్‌కు చెందిన భూనిర్వాసితులు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) రీజినల్ అధికారి శివశంకర్, గజ్వేల్ పీడీ ఎం.మాధవిలకు వినతిపత్రాలు గురువారం వారి కార్యాలయాల్లో అందజేశారు. చౌటుప్పల్-రాయగిరి-గజ్వేల్ ప్రాంతీయ రింగు రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని వారు కోరారు. దామోదర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రామలింగం, శ్రీశైలం, పాండు, రాములు, అనిల్‌కుమార్, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, సందగళ్ల మల్లేశం తదితరులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సైతం వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న చౌటుప్పల్‌కు చెందిన భూనిర్వాసితులు

రిపోర్టు చేసిన ఉపాధ్యాయులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: డీఎస్సీలో ఎంపికై నియామకపు ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు గురువారం డీఈవో కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఉపాధ్యాయుల రిపోర్టింగ్ ప్రక్రియ శుక్రవారం కొనసాగనుంది. జిల్లాకు 252 మంది ఉపాధ్యాయులు కొత్తగా నియమితులయ్యారు. వీరిలో గురువారం డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో 150 మంది ఉపాధ్యాయులు రిపోర్టు చేశారు. శుక్రవారం రిపోర్టు చేసే ఉపాధ్యాయులు తమ నియామకపత్రం జిరాక్స్ ప్రతితో పాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలు, పూర్తి పేరు, పోస్ట్ సెలక్ట్ కేటగిరీ , హాల్‌టికెట్ నెంబర్‌ల వివరాలు ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని డీఈవో సత్యనారాయణ తెలిపారు.

జూదరుల అరెస్టు

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న ఓ మినీ ఫంక్షన్ హాలులో గురువారం జూదం ఆడుతుండగా రూరల్ పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.23,610 నగదు, అయిదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

బీబీనగర్: అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీబీనగర్ మండలం గుర్రాలదండి గ్రామానికి చెందిన కాటేపల్లి రాములమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి రూ.2.5 లక్షల ఎల్‌వోసీ గురువారం అందజేశారు.

కార్యవర్గం ఎన్నిక

భువనగిరి పట్టణం: జైభీమ్ ఆటో డ్రైవర్ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పోత్నక్ ప్రమోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గాయపాక పరమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా తూంకుంట వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి సంతోష్‌కుమార్, కార్యదర్శిగా కట్ల కిషోర్, కోశాధికారిగా పాదం రమేష్ ఎన్నికయ్యారు.

ఇక వడివడిగా ట్రిపుల్‌ఆర్ భూసేకరణ

భువనగిరి, న్యూస్‌టుడే: ప్రాంతీయ వలయ రహదారి భూసేకరణ పనులు వేగంగా పుంజుకోనున్నాయి. హైకోర్టు స్టే ఉత్తర్వుల కారణంగా ఏడాదిగా భువనగిరి మండలంలో ట్రిపుల్‌ఆర్ భూసేకరణ పనులు నిలిచిపోయాయి. భువనగిరి మండలం రాయగిరి గ్రామానికి చెందిన రైతులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో న్యాయమూర్తి స్టే మంజూరు చేశారు. దీంతో భూసేకరణ నిలిచిపోయింది. పలు వాయిదాల్లో కేసు నడిచింది. చివరగా ఈ నెల 3న పిటిషనర్ల తరుపు న్యాయవాది, ప్రభుత్వం, ఎన్‌హెచ్ఏఐ న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి రైతుల పిటిషన్ ఈ నెల 5న కొట్టివేశారు. ఈ మేరకు ఆన్‌లైన్లో జిల్లా అధికారులకు తీర్పు కాపీ వచ్చింది. గతంలో ఐదు పర్యాయాలు ప్రభుత్వ అవసరాల కోసం తమ భూములు ప్రభుత్వం సేకరించిందని, మరో మారు తమ భూములు తీసుకుంటే తాము జీవనం కోల్పోయి రోడ్డుమీద పడతామని, మొదటి ఇచ్చిన నోటిఫికేషన్ కాకుండా రెండో సారి నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం చెబుతూ రైతులు కోర్టును ఆశ్రయించారు. రిట్ పిటిషన్‌ను కొట్టివేయడంతో భూసేకరణ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన తమ పనులు చేపడుతోంది.

☛ భువనగిరి మండలానికి సంబంధించి భూసేకరణ అధికారిగా ఆర్డీవో అమరేందర్‌ను ప్రభుత్వం నియమించింది. మండలం పరిధిలో ఆరు గ్రామాల మీదుగా 15 కిమీ మేర ప్రాంతీయ రహదారి వెళుతోంది. ఇందుకోసం సుమారుగా 195 హెక్టార్ల భూమిని సేకరించేందుకు అధికారులు ప్రకటన జారీ చేశారు.

☛ ఇప్పటికే 170 హెక్టార్లు సంబంధించి 3డీ నోటిఫికేషన్ జారీగా చేయగా 3జీ నోటిఫికేషన్ ఎన్‌హెచ్ఐ అధికారులకు పంపే పనిలో ఉన్నారు. కోర్టు కేసు కొట్టివేయడంతో మిగిలిన 25 హెక్టార్లకు సంబంధించి 3డి నోటిఫికేషన్ జారీకి ఎన్‌హెచ్ఏఐ అధికారులకు పంపించారు. 3జీ జారీ చేస్తే అవార్డు విచారణ మాత్రమే చేయాల్సి ఉంటుంది.

☛ ప్రభుత్వం ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని నిర్ణయించడంతో ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న భువనగిరి మండలంలో మరింత వేగవంతంగా భూసేకరణ క్రతువు పూర్తి చేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. మిగిలిన పనులను వేగవతంగా పూర్తి చేస్తామని భూసేకరణ అధికారి ఆర్డీవో పి.అమరేందర్ తెలిపారు.

నేడు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమి పూజ

మోత్కూరు, న్యూస్‌టుడే: తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమిపూజ శుక్రవారం ఉదయం జరుగుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలొచ్చి విజయవంతం చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.రామచంద్రుగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం మోత్కూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పుర అధ్యక్షురాలు గుర్రం కవిత, సింగిల్‌విండో ఛైర్మన్ పి.వెంకటేశ్వర్లు, పుర ఉపాధ్యక్షుడు బి.వెంకటయ్య, పైళ్ల సోమిరెడ్డి, బాలరాజు, డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

రతన్ టాటాకు ఘన నివాళి

భువనగిరి, న్యూస్‌టుడే: టాటా సంస్థల అధిపతి రతన్‌టాటా గొప్ప మానవతావాదని సామాజిక ఉద్యమ నాయకులు కొడారి వెంకటేష్, భట్టు రామచంద్రయ్య కొనియాడారు. బాబూజగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనేక పరిశ్రమలు విజయవంతంగా నడిపించి దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. ఆయనకు భారతరత్న బిరుదు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు జహంగీర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, ఉస్మాన్ షరీఫ్ పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో.. రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న స్థానిక నాయకులు

యాదగిరిగుట్ట పట్టణం: పారిశ్రామిక దిగ్గజం, టాటా గ్రూప్స్ గౌరవ అధ్యక్షుడు రతన్ టాటాకు గురువారం యాదగిరిగుట్టలో వివిధ పార్టీల నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించారు. కార్యక్రమంలో గుట్ట పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కాటబత్తిని ఆంజనేయులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సుడుగు జీవన్‌రెడ్డి, భాజపా పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, నాయకులు మల్లేశం, అరుణ్, నరేశ్, శ్యామ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా పరమపదించడంతో మండలంలోని రాయిపల్లి గ్రామ యువజన సంఘం సభ్యులు టాటా చిత్ర పటానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి, యువతకు కల్పించిన ఉపాధిని వారు కొనియారు. జె.శ్రీనివాస్, బి.సతీశ్‌కుమార్, సాయి, శివ, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పూలవనం.. ఊరూరా కోలాహలం

వాడవాడలా బతుకమ్మ వేడుకలు గురువారం కనుల పండువగా జరిగాయి. భువనగిరి జిల్లా వ్యాప్తంగా మహిళలు ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం హారతి ఇచ్చి బతుకమ్మలను వీధుల్లో, చెరువు కట్ట వద్ద చేర్చి ఆడిపాడారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలతో కదిలి వచ్చే దృశ్యాలు ఆకట్టుకున్నాయి. భువనగిరి పెద్ద చెరువు, ఆయా గ్రామాల్లో రాత్రి 9గంటల వరకు ఆడి నీటి వనరుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. సద్దులు పంపిణీ చేశారు. వేడుకల సందర్భంగా పట్టణాల్లో మున్సిపాలిటి, గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.
– న్యూస్‌టుడే, భువనగిరి గ్రామీణం



చౌటుప్పల్‌లో బతుకమ్మను తీసుకొస్తున్న పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంధ్య దంపతులు, మహిళలు



ఆలేరు: బహదూర్‌పేటలో బతుకమ్మ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



బీబీనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, బిగ్‌బాస్ ఫేమ్ సావిత్రి



యాదగిరిగుట్టలో..



రామన్నపేటలో సద్దుల బతుకమ్మ వేడుకలు



ఆలేరు: వివేకానందనగర్‌లో..



మోటకొండూరులో..



అడ్డగూడూరు: బతుకమ్మలతో యువతులు



బీఎన్ తిమ్మాపూర్‌లో..



యాదగిరిగుట్టలో.. బతుకమ్మను తీసుకువస్తున్న వనితలు



చౌటుప్పల్‌లో..



హౌజింగ్‌బోర్డు కాలనీలో ఇంటి వద్ద బతుకమ్మ ఆడుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సతీమణి వనిత



వలిగొండ శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



భువనగిరి పెద్ద చెరువు వద్ద నిమజ్జనం..